క్లుప్తంగా

ప్రభుత్వ విప్‌ను కలిసిన పద్మశాలీలు



పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

రామకృష్ణాపూర్: పట్టణానికి చెందిన పద్మశాలీ సంఘం నాయకులు గురువారం ప్రభుత్వ విప్ బాల్కసుమన్‌ను క్యాతనపల్లిలోని ఎమ్మెల్యే స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. చెన్నూర్ ఎమ్మెల్యే అభ్యర్థిగా రెండో సారి అవకాశం వచ్చినందుకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కాగా మార్కండేయా ఆలయ నిర్మాణానికి దేవాలయ నిధులు మంజూరు చేసేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే పద్మశాలీలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం పట్టణ అధ్యక్షుడు వనం సత్యం, ఆడెపు తిరుపతి, మల్లేష్, ఇప్పకాయల లింగయ్య, కొక్కుల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చెన్నూర్: పట్టణ- 1వ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. ఫీడర్-1 పరిధిలో గల గ్రంథాలయం, జెండావాడ, జగన్నాథాలయం, రాజీవ్ రోడ్, మార్కెట్ ఏరియా, ఉర్దూ స్కూల్, పుప్పాల హనుమాన్, బడా హనుమాన్ చాకలివాడ, కొటంవాడ, గోదావరిరోడ్డు, కుమ్మరిబొగుడ, బొక్కలగూడెం, బెస్తవాడ, , బ్రాహ్మణవాడ, గాలికుంట వాడలలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి విద్యుత్ శాఖకు సహకరించాలని కోరారు.

ఎమ్మెల్యే టికెట్ కోసం దరఖాస్తు



దరఖాస్తు చేస్తున్న పత్తి శ్రీనివాస్

రామకృష్ణాపూర్: బీజేపీ చెన్నూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టికెట్ కోసం పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పత్తి శ్రీనివాస్ గురువారం హైదరాబాద్‌లో దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు మాస్ సత్యనారాయణ, జంగపెల్లి మల్లయ్య, వైద్య శ్రీనివాస్, వీరమల్ల రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా లక్ష్మణ్



మందమర్రిరూరల్: కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా మందమర్రి పట్టణానికి చెందిన పుల్లూరి లక్ష్మణ్‌ను నియమిస్తూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ నియామకపత్రం జారీ చేశారు. స్థానికంగా గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో లక్ష్మణ్ మాట్లాడుతూ.. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పార్టీ శ్రేణులు సహకరించాలని కోరారు.

ఘనంగా గీతయజ్ఞం



గీతహోమ యజ్ఞంలో పాల్గొన్న భక్తులు

దండేపల్లి: శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా దండేపల్లి మండలం మాదాపూర్ శ్రీ కృష్ణ గోశాలలో గురువారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. గీతయజ్ఞం, గోపూజలు, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఉచిత అన్నదానం చేశారు. సమీప గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

విశ్వనాథ ఆలయంలో పూజలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు, అర్చకులు

మంచిర్యాలఅర్బన్: శ్రీ కృష్ణాష్టమి వేడుకలను పురస్కరించుకొని గురువారం భక్తులు ఆలయానికి పోటెత్తారు. విశ్వనాథ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో గోపాలకృష్ణున్ని సందర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. గోమాతను పూజించారు. ఆలయ ఈవో రవి, అర్చకులు నరహరిశర్మ, భట్టాచార్యులు పాల్గొన్నారు.

వేమనపల్లి: శ్రీ కృష్ణుడు, గోపిక వేషధారణలో విద్యార్థినులు



కృష్ణాష్టమి సంబురం..!



చంద్రవెల్లిలో ఉట్టి కొట్టే వేడుకలో చిన్నారులు

జిల్లా వ్యాప్తంగా శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు పోటెత్తారు. భజన చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇళ్లు, పాఠశాలల్లో వేడుకలు నిర్వహించగా చిన్నారులను కృష్ణుడు, గోపికమ్మల వేషధారణల్లో ముస్తాబు చేశారు. పాఠశాలల్లో శ్రీ కృష్ణుడు, గోపిక పాత్ర వేషధారణలతో విద్యార్థులు ప్రదర్శించిన నాటికలు ఆకట్టుకున్నాయి. కూడళ్లలో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ప్రజలందరూ ఆసక్తిగా తిలకించారు. భక్తిపాటలు, నృత్యాలతో హోరెత్తించారు.

– భీమారం/మంచిర్యాలఅర్బన్/భీమిని/నెన్నెల/లక్సెట్టిపేట/దండేపల్లి/చెన్నూర్‌రూరల్/మంచిర్యాలటౌన్/వేమనపల్లి/చెన్నూర్/బెల్లంపల్లిరూరల్



లక్సెట్టిపేట: బ్రిలియంట్ మోడల్ పాఠశాలలో...



మంచిర్యాలటౌన్: ఏసీసీ 3 అంగన్‌వాడీ కేంద్రంలో..



అంగ్రాజ్‌పల్లిలో కృష్ణుడు, గోపిక వేషధారణల్లో చిన్నారులు



భీమారం: అంగన్‌వాడీ కేంద్రంలో కృష్ణాష్టమి వేడుక



చెన్నూర్‌లో...



దండేపల్లి: కస్తూర్బా పాఠశాలలో...



పేదల అభ్యున్నతికి సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు

నస్పూర్: పేదల అభున్నతికే రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని ఎమ్మెల్యే దివాకర్‌రావు తెలిపారు. పట్టణంలోని 11వ వార్డు అంబేద్కర్ కాలనీలో గురువారం ఆయన పర్యటించారు. ఇంటింటికీ బీఆర్‌ఎస్ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ, కాలనీలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, పట్టణ అధ్యక్షుడు అక్కూరి సుబ్బయ్య, కౌన్సిలర్లు మర్రి రాజమౌళి, మడిగ మల్లయ్య, సంధ్యారాణి, నాయకులు హైమద్, సంతోష్‌చారి, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

‘పేదల అభివృద్ధికే పథకాలు’

లక్సెట్టిపేట: ప్రభుత్వం పేదల అభివృద్ధికే సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని గొల్లగూడెం గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన గొర్రెల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడారు. గొర్రెలు పొందిన లబ్ధిదారులు వాటిని కాపాడుకోవాలని, జీవనోపాధి పొందాలని సూచించారు. అనంతరం లబ్ధిదారులకు గొర్రెలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నల్మాసు కాంతయ్య, వైస్ చైర్మన్ పొడేటి శ్రీనివాస్‌గౌడ్, కౌన్సిలర్ చాతరాజు రాజన్న, పట్టణాధ్యక్షుడు పాదం శ్రీనివాస్, పశువైద్యాధికారి శ్వేత నాయకులు పాల్గొన్నారు.



గొర్రెలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

సైబర్ మోసాలతో జాగ్రత్త

వేమనపల్లి: సైబర్ మోసాలతో జాగ్రత్తగా ఉండాలని చెన్నూర్‌రూరల్ సీఐ విద్యాసాగర్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం సాయంత్రం పోలీసు కళాజాత బృందం మహిళా చట్టాలు, సంరక్షణ, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఆపద సమయంలో డయల్ 100సద్వినియోగం చేసుకోవాలన్నారు. ట్రాఫిక్ రూల్స్, పోక్సో యాక్టు, బాల్యవివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నేరమని సూచించారు. ఈ సందర్భంగా పోలీసు కళాజాత కళాకారులు ఇచ్చిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎస్సై సుబ్బారావు, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

పార్టీలో చేరినవారిపై ఆరోపణలు సరికాదు

- బీఆర్‌ఎస్ తీరుపై కాంగ్రెస్ నేతల ఆగ్రహం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): బీఆర్‌ఎస్‌లో తగిన ప్రాధాన్యం, గుర్తింపు లేకపోవడంతో ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిపై ఆరోపణలు చేయడం సరికాదని బీఆర్‌ఎస్ నేతలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు హితవు పలికారు. హాజీపూర్ మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. జెడ్పీటీసీ పూస్కూరు శిల్ప, రైతుబంధు సమితి మండల కన్వీనర్ శ్రీనివాసరావు, టీకానపల్లి ఉప సర్పంచ్ జితేందర్‌రావులతో పాటు పలువురు బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరగా వారిపై బీఆర్‌ఎస్ నాయకులు అర్థం లేని ఆరోపణలు చేయటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తోట రవి, ఎంపీటీసీలు డేగ బాపు, ఒడ్డె బాలరాజు, ఓబీసీ మండల అధ్యక్షుడు సాంబారి కుటుంబరావు, మాజీ సర్పంచ్ అంకం కృష్ణమూర్తి, ఉప సర్పంచ్ జితేందర్‌రావు, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కొనసాగుతున్న ‘నా దేశం - నా మట్టి’



మట్టి సేకరిస్తున్న శ్రీనివాస్, తదితరులు

భీమారం: మండల కేంద్రంలోని శ్రీ కోదండరామాలయంలో గురువారం బీజేపీ ఆధ్వర్యంలో మట్టి సేకరించారు. ‘నా దేశం- నా మట్టి’ కార్యక్రమంలో భాగంగా అన్ని దేవాలయాల్లో మట్టి సేకరించి ఢిల్లీలోని అమృతవనానికి తరలిస్తున్నామని బీజేపీ నియోజకవర్గ ప్రధానకార్యదర్శి, ‘నా దేశం- నా మట్టి’ కార్యక్రమ కో ఆర్డినేటర్ అందుగుల శ్రీనివాస్ తెలిపారు. మన సంస్కృతిని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ముఖ్యంగా జిల్లాలోని అన్ని అలయాల్లోని మట్టిని సేకరించడం ఒక యజ్ఞంలా చేపడుతున్నామని తెలిపారు.కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు వేల్పుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ భరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన



భీమారం: చెన్నూర్ నియోజకవర్గం అభివృద్ధిలో దూసుకుపోతోందని జిల్లా గొర్రెల పెంపకం దారుల సహకార సంఘం చైర్మన్ కొమ్ము అశోక్ యాదవ్ అన్నారు. మండలంలోని దాంపూర్‌లో గురువారం ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. గతంలో ఎన్నో ప్రభుత్వాలు పాలించినా.. ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ప్రభుత్వవిప్ బాల్క సుమన్ కోట్లాది రూపాయలతో వంతెనలు, రోడ్లు నిర్మించారని, విద్య, వైద్యం విషయంలో ప్రత్యేక చొరువ తీసుకుంటున్నారని తెలిపారు. మందమర్రిలో ఆయిల్‌ఫాం ఫ్యాక్టరీ నెలకొల్పేందుకు కృషి చేస్తున్నాడని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ భాస్కర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

‘కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే పేదలకు న్యాయం’

చెన్నూర్/జైపూర్/మందమర్రిరూరల్: కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పేదలకు న్యాయం జరుగుతుందని కాంగ్రెస్ నాయకులు డాక్టర్ రాజారమేశ్ తెలిపారు. రాజీవ్‌గాంధీ చేపట్టిన జోడోయాత్ర ‘హాత్ సే హాత్’ సంవత్సరం పూర్తయిన సందర్భంగా చెన్నూర్‌లో రాజారమేశ్ ఆధ్వర్యంలో కొత్త బస్టాండ్ నుంచి పెద్ద చెరువు కట్ట వరకు, మందమర్రిలో పీసీసీ మెంబర్ నూకల రమేష్, టీపీసీసీ డాక్టర్స్ సెల్ వైస్ చైర్మన్ దాసారపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో పాత బస్టాండ్ ఏరియా నుంచి సాయిబాబా గుడి వద్ద గల అంబేద్కర్ విగ్రహం వరకూ ర్యాలీ నిర్వహించారు. జైపూర్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకురాలు రామిళ్ల రాధిక ఆధ్వర్యంలో యాత్రకు సంఘీభావంగా ప్రజలకు శర్బత్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

గైర్హాజరు ఉద్యోగులకు కౌన్సెలింగ్

నస్పూర్: శ్రీరాంపూర్ ఏరియా ఉపరితల గని, జీఎం కార్యాలయ గైర్హాజరు కార్మికులకు గురువారం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయ సమావేశ మందిరంలో డీజీఎం(పర్సనల్)ఫ్యామిలీ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీఎం మాట్లాడుతూ ప్రతీ ఉద్యోగి తమ హాజరుశాతాన్ని పెంచుకోవాలని సూచించారు. తరుచూ గైర్హాజరు అవుతున్న ఉద్యోగులపై సంస్థ క్రమశిక్షణా చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. ఎవరికైనా ఆరోగ్య సమస్యలు ఉన్నట్లైతే, వారి రిపోర్టును పరిశీలించి తగు న్యాయం చేయనున్నట్లు తెలిపారు. కౌన్సెలింగ్‌కు 10మంది ఉద్యోగులు తమ కుటుంబ సభ్యులతో కలిసి హాజరయ్యారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, డీవైసీఎంఓ డాక్టర్ రమేశ్‌బాబు, డీవైపీఎంలు రాజేశ్వర్‌రావు, రాజేశ్, అధికా రులు ప్రకాశ్, కల్యాణి తదితరులు పాల్గొన్నారు. ఆర్‌కే6 గని గైర్హాజరు ఉద్యోగులకు గనిపై ఫ్యామిలీ కౌన్సెలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో గని మేనేజర్ తిరుపతి, శ్రీనివాస్, రక్షణాధికారి సునీల్‌కుమార్, సంక్షేమ అధికారి, పిట్ సెక్రటరీ భూమయ్య తదితరులు పాల్గొన్నారు.



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీజీఎం అరవిందరావు

మల్లయ్య అకాల మరణం సీపీఐకి తీరని లోటు

బెల్లంపల్లి: భారత కమ్యూనిస్టుపార్టీ(సీపీఐ), సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ నాయకుడు పుల్లూరి మల్లయ్య అకాల మరణం తీరనిలోటని సీపీఐ నాయకులు పేర్కొన్నారు. పట్టణ సీపీఐ కార్యాలయంలో గురువారం సంతాపసభ నిర్వహించి మల్లయ్య చిత్రపటానికి పూలమాల వేసి కామ్రేడ్స్ జోహార్లు అర్పించారు. సీపీఐ అసెంబ్లీ నియోజకవర్గ కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు ఎం.వెంకటస్వామి, చిప్ప నర్సయ్య, బి.పూర్ణిమ, ఆడేపు రాజమొగిలి, ఉపేందర్, రాజేశ్, బి.వెంకటస్వామి, తిరుపతి గౌడ్, అక్కెపల్లి బాపు, జీసీ మాణిక్యం, ఎల్తూరి శంకర్, బి.లక్ష్మీనారాయణ, రత్నం ఐలయ్య, రాజం, రాంచందర్, స్వామిదాసు, బండారి శంకర్ తదితరులు పాల్గొన్నారు.



జోహార్లు అర్పిస్తున్న నాయకులు

సంక్షిప్త వార్తలు

భూమాచారికి వర్తకసంఘం మద్దతు

జన్నారం: ప్రజల, వ్యాపారుల, రైతుల సమస్యలను దృష్టిలో పెట్టుకుని జన్నారం మండలానికి 132కేవీ సబ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని వర్తక సంఘం అధ్యక్షుడు బండారు మారుతిరాజ్, ప్రధాన కార్యదర్శి జక్కు రమేశ్ డిమాండ్ చేశారు. 132కేవీ సబ్‌స్టేషన్ కోసం సామాజిక వేత్త శ్రీరాముల భూమాచారి చేస్తున్న రిలే నిరహార దీక్షకు గురువారం మద్దతు తెలుపుతూ వర్తక సంఘం నాయకులు దీక్షలో కూర్చున్నారు.

దుబ్బులకొలుపు కళాకారుల కమిటీ ఎన్నిక

చెన్నూర్‌రూరల్: మండలంలోని సుందరసాల గ్రామంలో గురువారం దుబ్బుల కొలుపు కళాకారుల సంఘం కమిటీని ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు జునుగరి నారాయణ, ప్రధాన కార్యదర్శి జునుగరి రాజ్‌కుమార్ తెలిపారు. డివిజన్ ప్రధాన కార్యదర్శిగా బోయిరి లక్ష్మణ్‌ను, చెన్నూర్ మండల అధ్యక్షుడిగా బోగిరి రవి, ఉపాధ్యక్షుడిగా మొగుర్ల సమ్మయ్య, ప్రధాన కార్యదర్శిగా రాటె రవిలను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

నేడు 36వార్డుల్లో వార్డు సభలు

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీ పరిధిలోని 36వార్డుల్లో శుక్రవారం ప్రత్యేక వార్డు సభలను ఉదయం 9గంటలకు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆదేశాల మేరకు అన్ని వార్డుల్లో మున్సిపల్ అధికారులు వార్డు సభా సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఓటరు కార్డు లేనివారు, 18సంవత్సరాలు నిండిన వారందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

తాండూర్: ఈ నెల 9వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని తాండూర్ సీఐ కె.శ్రీనివాస్‌రావు ఒక ప్రకటనలో కోరారు.

10న వాలీబాల్ అసోసియేషన్ సమావేశం

మంచిర్యాలటౌన్: జిల్లా వాలీబాల్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 10వ తేదీ ఆదివారం నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు శంకర్, కార్యదర్శి మైలారం శ్రీనివాస్, కోశాధికారి గాజుల శ్రీనివాస్ ప్రకటనలో పేర్కొన్నారు.

పేదలను ఆదుకోవాలి

చెన్నూర్‌రూరల్: గుడిసెలు కాలిపోయిన పేదలను ఆదుకోవాలని రజక వృత్తిదారుల సంఘం కార్యదర్శి పాయిరాల రాములు అన్నారు. మండలంలోని బావురావుపేట గ్రామ సమీపంలో కాలిపోయిన గుడిసెలను గురువారం పరిశీలించారు.